కదా." అన్నాడు ఎమ్వీయల్. "భర్తృహరి ఏమన్నాడు? నాయనలారా, సంపద అనేది అన్నిటికంటే దుఃఖదాయకం. సంపాదించడం కష్టం; దాన్ని కాపాడుకోవడం కష్టం; అది పోతూ ఉంటే యాడవడం కష్టం-అని కదా!" అని చెప్పి; టైమన్ గార్ని సమర్థించేడు కూడాను.

ఆ తరవాత "ఇచ్చుటలో ఉన్న హాయి" ఫిలాసఫీ గురించి నేను కూడా చాలాసార్లు ఆలోచించేను. మా ఆవిడ తను వండిన కూరలూ, చేసిన పచ్చళ్ళూ, మరిగించిన పులుసులూ- ఇరుగుపొరుగు వాళ్లకి ఇవ్వడంలో తను ఆనందం పొందడమే కాకుండా, "ఇవాళ మధ్యాన్నం మీరు నిద్రపోతున్నారు గానీ, పొరుగింటి పోలేరమ్మగారు నేను (వంకాయ ఉల్లికారం పెట్టి) చేసిన కూర గురించి ఎంత పొగుడుతూ మాట్లాడిందో" లాంటి డైలాగులు చెప్పడం అలవాటు చేసుకుంది.

నాకు తెలిసిన ఒక మిలియనీర్ రచయిత తను అచ్చు వేయించుకున్న తన కవితా సంకలనం వెయ్యి కాపీల్లో ఒక్కటంటే ఒక్కటికూడా అమ్మకానికి పెట్టకుండా అన్నీ కాంప్లిమెంటరీ కాపీలుగా ఇచ్చేశారు. నేనొకసారి ఒక ఫోర్ స్టార్ హోటల్లో దిగిన నా ఫ్రెండుని పలకరిద్దామని వెళితే అక్కడ "ఉదయం ఏడుగంటల నుండి పదిగంటల వరకు (మా హోటల్లో రూముల్లో బసచేసిన వారికి) కాఫీ బ్రేక్ ఫాస్టు (ఫలహారం) కాంప్లిమెంటరీ" అని బోర్డుంది. ఒకానొక ఉత్తరాది సంస్థవారు తాము వ్యవస్థాపించిన బ్యాంకుకి "ఇచ్చే బ్యాంకు" అని అర్థం వచ్చే పేరు పెట్టేశారు.

కొన్నాళ్లకిందట నా ఫ్రెండు రాజమౌళి ఒకరోజున వాణిజ్య పన్నుల శాఖ ఆఫీసులో ఉద్యోగులకి, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఉద్యోగులకి ఆదాయపు పన్ను శాఖ ఉద్యోగులకి కొంత కొంత చొప్పున ఇచ్చిన సందర్భంగా అదంతా కూడితే నాకుటుంబానికి ఒక ఏడాది గ్రాసం అని తేలింది. "ఎందుకిలా ఇచ్చేసేవు" అని అడిగితే - వాళ్లందరూ నన్ను "ఇచ్చే" పరిస్థితుల్లో ఉండనిచ్చినందుకు - అని జవాబు చెప్పి "ఇచ్చుటలో ఉన్న హాయి, వేరెచ్చటనూ లేదు భాయీ" అని పాడేడు.

మా వూళ్లో సిటీ బస్సుల కండక్టర్లున్నారే; వాళ్లది ఇంకోరకం హాయి. డెబ్భయ్యయిదు పైసల టిక్కెట్టు కోసం రూపాయి పుచ్చుకున్నప్పుడూ, రూపాయి పావలా టిక్కెట్టుకోసం రూపాయిన్నర పుచ్చుకున్నప్పుడూ, రూపాయి డెబ్భయ్యయిదు పైసల టిక్కెట్టుకి రెండు రూపాయల నోటు పుచ్చుకున్నప్పుడూ వాళ్ల ఆ తోలుసంచీలు అతి జాగ్రత్తగా గలగల్లాడించి గిలగిల్లాడి ఇరవై పైసలు నాణాలు తీసి ఇస్తారు. ఇది కూడా ఇచ్చుటలో ఉన్న హాయే. ★

## 103. అప్పువిష(య)చక్రం

**మా** గణేశ్వరరావుకి ఒకప్పుడు అప్పులు చెయ్యడం అదొక గొప్ప హాబీగా వుండేది. సూత్రం ఏమిటంటే : దేశం పై దేశాల నుంచి అప్పులు తీసుకుంటుందీ; అలాగే మనుషులు కూడా పక్క వాళ్లనుంచీ పరిచయస్తుల వరకూ ఎవరు దొరికితే - (అదే - ఎవరి దగ్గిర దొరికితే) - వారి దగ్గిర అప్పు తీసుకొని దేశమంటే మనుషులే అని నిరూపించాలని.

అరవై మూడులోంచి ముప్పయ్యారు తీసేయవలసి వచ్చినపుడు మూడు లోంచి ఆరు తగ్గించలేం కనక పక్క అంకెలోంచి అప్పు తెచ్చుకోమని రెండో క్లాసు చదువుతున్నప్పుడు మేష్టారు చెప్పేరుట.

"అయితే దేశం అప్పుడప్పుడు "ఎయిడ్సు" తెచ్చుకుంటుంది కదా; మనుషులు కూడా ఎయిడ్సు

తెచ్చుకోవాలా?'' అంటే, "తప్పు, తప్పు! ఎయిడ్సు చాలా ప్రమాదం. గ్రాంట్సు తెచ్చుకోవడం మంచిది'' అంటాడు. ఓసారి మా గణేశ్వరరావుకి గవర్నరు గారి ఆఫీసులో పని చేస్తున్న అతని ఫ్రెండు ఒకతను ఫోన్ చేసి; ఆవేళ గవర్నరు గారు ముఖ్య అతిథిగా పాల్గొనే ఒక సభకి రమ్మని ఆహ్వానిస్తే; "బాబోయి, నేను రాను! గవర్నరు గారి పక్కని ఎయిడ్సు! నాకు భయం'' అనేశాడు. "మరి గ్రాంట్సు తీసుకోవచ్చు కదా'' అంటేను; దేశం ఇంకో దేశం నుంచి పుచ్చుకునేది గ్రాంట్సే అయినా మనుషులు పక్కవాళ్ల నుంచి గ్రాంట్సు తీసుకుంటే దానిపేరు గ్రాంటు అనకూడదనీ, బిచ్చం అనాలనీ అంటాడు.

గణేశ్వరరావు అప్పులు చెయ్యడంలో చిత్రమైన పద్ధతి అవలంబిస్తాడు. "చేబదుళ్లు'' వడ్డీ లేకుండా తీసుకోడం మొదటి స్టెప్పు. చే బదుళ్లు ఇచ్చిన వాళ్ల సంఖ్య బాగా పెరిగిపోయినప్పుడు ఏ వీధిలోంచి వెళ్లినా అప్పుల వాళ్లే ఎదురవుతారు. కొన్నాళ్లపాటు ఈ వీథులన్నీ తిరగడం మానెయ్యాలి. అందువల్ల ఆఫీసుకి వెళ్లేటప్పుడు ముందుగా ఊరవతలికి వెళ్లి, బైపాస్ రోడ్డు, రింగురోడ్డు చక్కబెట్టి అట్నుంచి అలా వెళ్లవలసి వచ్చేది. "అలా చుట్టుదార్లమ్మట వెళితే టైం వేస్టు; పైగా అలసట వచ్చి ఆరోగ్యం పాడవుతుంది'' అని ఎవరో నచ్చజెప్పారు. అప్పుడు గణేశ్వరరావు స్వల్పవడ్డీకి పెద్ద అప్పు ఒకటి చేసి, చే బదుళ్లు - అంటే వడ్డీలేని అప్పులు - మొత్తం తీర్చేశాడు. "అప్పు ఎంతయినా ఉండొచ్చు; కాని అప్పుల వాళ్లు ఒకరిద్దరు కన్నా ఉండకూడదు.'' అని ఒక సినిమాలో ఒకానొక అప్పు శాస్త్రజ్ఞుడు చెప్పేడుట.

స్వల్పవడ్డీకి గణేశ్వరరావుకి అప్పులిచ్చిన వాళ్లు వడ్డీ తక్కువ వస్తోంది కదా అని వేగిరం తీర్చెయ్యమని ఒత్తిడి చేస్తే; మరికొంచెం ఎక్కువ వడ్డీకి ఆఫీసు నుంచి రుణాలు తీసుకోడం ఇది మూడో స్టెప్పు. మోటారు సైకిలు కొంటాననీ, దానికి రుణం యిమ్మనీ అప్లికేషను పెడితే ఆరుశాతం వడ్డీకి రుణం దొరుకుతుంది. అది పుచ్చుకుని అంతకి ముందున్న బాకీలు కొట్టెయ్యడం. "మోటర్ సైకిల్ లోన్ తీసుకున్నావు గాని ఇంతవరకు కొనలేదు; వెంటనే ఆ డబ్బంతా ఆఫీసులో కట్టు'' అని రెండు నెలల తరువాత ఆఫీసువాళ్లు నోటీసిస్తారు. అప్పుడు ఇల్లు కట్టుకోడానికి జాగా కొంటున్నాను గనక అంటూ మరో రుణం తీసుకుని మోటార్ సైకిల్ రుణం ఆఫీసుకి కట్టేస్తాడు. "సైటు కొంటానని లోన్ తీసుకున్నావు గాని ఇప్పటిదాకా సైటు రిజిస్ట్రేషన్ కాగితం ఆఫీసులో చూపించలేదు గనక సైట్‌లోన్ డబ్బు వెంటనే ఆఫీసులో కట్టెయ్యి'' అని మరో నోటీసు వస్తుంది. అప్పుడు హడావుడిగా "మా మేనకోడలికి పెళ్లి కుదిరింది'' ఆ పిల్లకి తల్లీతండ్రీ లేరు గనక నేనే ఆ పెళ్లి ఖర్చులు పెట్టుకోవాలి; కనక నా ప్రావిడెంట్ ఫండ్‌లోంచి అప్పు ఇవ్వ ప్రార్థన'' అంటూ ఒక పెళ్లికార్డు (ఒకే ఒక్కకాపీ) అచ్చు వేయించి దానికి వార్డు కౌన్సిలర్ గారిచ్చిన ధ్రువీకరణ పత్రం జతచేసి పెట్టి; ఆ విధంగా అందే సొమ్ములో కొంత భాగంతో సైట్‌లోన్ తీర్చేస్తాడు.

ఇలా నిరంతరం లోన్‌లకి లోనవుతూ వుండడం వల్ల గణేశ్వరరావుకి నెలవారీగా వచ్చే జీతం బాగా తగ్గిపోయి ఒకసారి కాబూలీవాలా చేతికి కూడా చిక్కిపోయాడు గణేశ్వరరావు. ఆ అప్పు సంగతి గణేశ్వరరావు నాన్నగారికి ప్రాణంమీది కొచ్చినప్పుడు ఆయనకి తెలిసిపోయింది. ఆఖరికి ఆయన "ఎప్పుడూ వడ్డీకిగాని, వడ్డీ లేకుండా గాని అప్పుతీసుకోను'' అని గణేశ్వరరావు చేత ప్రమాణం చేయించుకుని కాలం చేసేరు. పోతూపోతూ ఆయన తన సందుగు పెట్లో దాచిన

డబ్బు గణేశ్వరరావుకి వప్పగించి అప్పటికి ఉన్న అప్పులన్నీ తీర్మానం చేయించేశారు.

నాటికి నేడు గణేశ్వరరావు అత్యవసర పరిస్థితుల్లో నా దగ్గిర మూడంటే మూడు వందలు అప్పు తీసుకుంటూ; "ఇది నీకు ఖచ్చితంగా, పైనెల పదకొండో తారీకుని నువ్వు హైదరాబాదు వచ్చినప్పుడు ఇచ్చేస్తాను." అన్నాడు.

మొన్న పదకొండో తారీకుని హైదరాబాదు వెళ్లేను. "రైలు దిగి తిన్నగా మీ ఇంటికి వచ్చేస్తాను" అని ఉత్తరం రాసేను కదా అని ఆ ప్రకారం వెళ్లగా; అతను కాపురం ఉండే ఇంటి తలుపుకి "టు-లెట్" బోర్డు పెట్టివుంది. ఈ మాత్రం దానికి మేడమీదకి వెళ్లడం దేనికని, కిందని కూర్చున్న ఆ ఇంటి వోనర్‌గార్ని "వీళ్లు ఎక్కడికి మారిపోయారు?" అని అడిగాను. "ఏమో తెలీదండి" అన్నాడాయన.

ఆఫీసుకెళ్లి కనుక్కుందామంటే ఆదివారం అయింది. సరేకదా అని వేరే చోట మకాం చేసి సోమవారం నాడు గణేశ్వరరావు ఆఫీసుకి ఫోన్ చేశాను. "ఆయన సెలవులో ఉన్నారండి." అని జవాబు వచ్చింది. నేను మకాం చేసిన చోట ఉన్న టెలిఫోన్ నెంబరు ఇచ్చి: పధ్నాలుగో తారీకున నేను విశాఖపట్నం వెళ్లిపోతున్నాననీ, వీలుంటే ఆ లోగా ఫోన్ చెయ్యమని చెప్పమనీ చెప్పేను. ఫోన్‌లో మాట్లాడినాయన నేను ప్రయాణం చేసే రైలు, అందులో బోగీ నెంబరు, అందులో బెర్తు నెంబరు అడిగి రాసుకున్నాడు.

పధ్నాలుగో తారీకునాడు నాంపల్లి స్టేషన్‌లో "గోదావరి ఎక్స్‌ప్రెస్ బయలుదేరుటకు సిద్ధముగా యున్నది" అని అనౌన్సు చేసిన వేళకి గణేశ్వరరావు ఒగర్చుకుంటూ వచ్చేడు. హడావుడిగా మూడు వంద రూపాయల నోట్లు జేబులోంచి తీసి నాకు ఇచ్చి "సారీ; మూడు వందలు; మూడు రోజులు ఆలస్యం - "అంటూ అలసిపోయాడు.

బండి బయలు దేరింది.

"అదిసరే; ఇల్లు మారావుట కదా? కొత్త అడ్రస్ నాకు రాయలేక పోయావా?" అన్నాను.

"ఇల్లు మార్లేదు. అక్కడే ఉన్నాను. నీకివ్వాలని మా ఇంటివోనర్ని మూడు వందలు అడిగితేను; మూడు రోజుల తరువాత గానీ ఇవ్వలేనని చెప్పి, ఈలోగా నువ్వొచ్చి అడిగేస్తావేమో అంటే; 'అదంతా నేను చూసుకుంటాన్లే' అని- అతనే మా తలుపుమీద ఉన్న నా నేమ్‌బోర్డు తీయించేసి టు-లెట్ బోర్డు పెట్టాడు." అని-

పరుగెడ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలుతో సమానంగా పరుగెత్తలేక; దూరం అయిపోతూ కొంచెం కొంచెంగా గొంతెత్తి అరుస్తూ చెప్పాడు గణేశ్వరరావు. ★

# 104. నంచుకు తిందాం, రండి!

"రెరెరెరె! ఇరణ్యా కసిపుడరా, నిన్ను-
ఇరసక తింటనురా!"
"హొరెహొరె! నర్సిమ్మసామినిరా, నిన్ను -
నంచుక తింటనురా!"

అని రెండు చరణాలున్న పాట వొకటి, పేరు జ్ఞాపకం లేదు గాని; ఒక తెలుగు సినిమాలో పాడించేరు.